# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 161 26-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



2లో

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం: వైఎస్ జగన్

- డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని జగన్ ఆరోపణ
- దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన
- రుణాలపై వడ్డీ రాయితీ హామీని విస్మరించడం వల్ల మహిళలకు రూ.6 వేల కోట్లు నష్టం
- వైసీపీ హయాంలో వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని వెల్లడి

2లో

## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

### జూలై 1నుంచి కొత్త ఫీజులు అమలు

న్యూఢిల్లీ:కేంద్రం తాజాగా పాస్‌పోర్టు ఫీజులను పెంచింది. కొత్త ఫీజులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రకటన ప్రకారం, 18 ఏళ్లు పైబడిన వారు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) లేదా పాస్‌పోర్టు రీఇష్యూ కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది.




2లో



# ఐకమత్యంతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం

### జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచన

### దేశంలో డ్యాంల పూడికతీతకు భారీ ప్రణాళిక

- పరస్పర సహకారంతోనే తుంగభద్రకు 33 కొత్త గేట్లు
- దీంతో తుంగభద్ర సామర్థ్యం 30 శాతం పెరుగుతుంది
- తుంగభద్ర గేట్ల ఆధునికీకరణతో 3 తరాల నీటి సమస్యకు పరిష్కారం: రేవంత్
- నదుల లింకింగ్‌తో భారత్ ఏకతాటిపైకి: పాటిల్
- ఇచ్చిపుచ్చుకుంటేనే ప్రయోజనం: చంద్రబాబు
- రైతుల కోసం సమన్వయంతో పనిచేస్తాం: డీకే

తుంగభద్ర నదీ జల వివాద పరిష్కారం కోసం కేంద్రం నేతృత్వంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులతో 'హైలెవల్ కమిటీ (ఉన్నత స్థాయి కమిటీ)' వేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఈ కమిటీ 100 రోజుల్లోగా జల వివాదాల పరిష్కార చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. దాదాపు 70 ఏళ్లుగా తుంగభద్ర నీటి కోసం వివాదాలు నెలకొన్న నేపథ్యంలో వాటిని పరిష్కరించడానికి జలశక్తి మంత్రి చొరవ చూపారు. తుంగభద్ర డ్యాంకు ఏర్పాటు చేసిన కొత్త క్రస్ట్ గేట్లను పాటిల్ గురువారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, డీకే శివకుమార్, ఎ.రేవంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

# ఉద్యోగులకు భారీ భరోసా..





### ఉచిత బీమా, పీఆర్సీపైనా సీఎం హామీ

- రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా
- 14 బ్యాంకులతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూలు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు
- ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు
- విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు
- పీఆర్సీ హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం స్పష్టం

2లో

# స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



### అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

### కార్యకర్తలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

మంత్రాలయం: మరో మూడు నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించాలని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరంలో తెదేపా శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. కర్ణాటకలోని

2లో

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..

### అధికారులకు కీలక ఆదేశాలు

- ప్రభుత్వ పాఠశాలలకు లక్షకు పైగా కొత్త అడ్మిషన్లు
- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై అధ్యయనానికి ఆదేశం
- సెప్టెంబర్ 5 నుంచి ఏఐ ట్యూటర్ విధానం పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం
- అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, అభ్యసన ఫలితాలపై ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను



2లో

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే: కేటీఆర్

- రూ.కోటి విలువ భూములు ఇప్పుడు రూ.60 లక్షలకు కూడా అమ్ముడవడం లేదని వ్యాఖ్య
- కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
- రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ
- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కార్యకర్తలకు పిలుపు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత



## పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

- ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి
- 72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర
- బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా

2లో

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

### క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

- జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు.. జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


# ఐకమత్యంతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం

తొలుత 17, 18, 19, 20వ నంబరు గేట్ల వద్ద పూజలు నిర్వహించి.. జాతికి అంకితం చేశారు. అనంతరం డ్యాం దిగువన కొప్పళ జిల్లా మునిరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఏపీ, కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. తుంగభద్ర సంబంధిత వివాదాల పరిష్కారం కోసం కేంద్రం సీనియర్ అధికారులతో త్వరలోనే ఉన్నత స్థాయి కమిటీ వేస్తుందని పాటిల్ తెలిపారు. ఈ కమిటీ కొన్ని ఆప్షన్లు ఇస్తుందని.. వాటిలో ప్రయోజనం చేకూర్చేవాటిని ఆయా రాష్ట్రాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ ప్రతిపాదనను ముగ్గురు సీఎంలు స్వాగతించారు. దేశవ్యాప్తంగా అనేక ఆనకట్టల్లో 15 శాతానికి పైగా పూడిక పేరుకుపోయిందని, దీంతో నీటినిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయిందని పాటిల్ చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూడిక తొలగింపు కోసం కేంద్రం సొంత నిధులతో త్వరలో భారీ ప్రణాళిక అమలు చేయనుందని తెలిపారు.గేట్లను అమర్చడం సాధ్యమైందని గుర్తుచేశారు. నదీ జలాల విషయంలో ఉత్తరాది రాష్ట్రాలు సమన్వయంతో.. సామరస్యపూర్వకంగా వివాదాలకు తావులేకుండా పరిష్కరించుకుంటున్నాయని పాటిల్ వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కూడా



కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుంటూ నదుల అనుసంధాన పథకాన్ని చేపట్టేందుకు ముందుకు రావాలని పాటిల్ సూచించారు.తమకొక రాష్ట్రం ఎక్కువ కాదు.. మరో రాష్ట్రం తక్కువా కాదని స్పష్టం చేశారు. రాష్ట్రాలు బాగుపడితేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని కేంద్రం బలంగా నమ్ముతోందన్నారు.

**బాబు పట్టుదలతో ఓ నగరమే అభివృద్ధి**

'బెంగళూరు సహజసిద్ధంగా అభివృద్ధి చెందిన నగరం. ఇక్కడి వాతావరణం, లాజిస్టిక్స్ నగరాభివృద్ధికి దోహదపడ్డాయి. కానీ హైదరాబాద్ పరిస్థితి అలా కాదు. ఆ నగరాన్ని చంద్రబాబు పట్టుదల, అనుభవం, దూరదృష్టితో ఐటీతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు' అని సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు. కొత్త గేట్ల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు కర్ణాటక వెళ్లిన చంద్రబాబు హోస్పేట్‌లోని ఐఆర్బీ అతిథిగృహంలో శివకుమార్, రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను, చంద్రబాబు ఇద్దరం యువజన కాంగ్రెస్ నుంచి వచ్చిన వారిమేనని.. ఆయన పోరాటస్ఫూర్తి, పట్టుదల, దూరదృష్టి గురించి పలు సందర్భాల్లో తాను మాట్లాడుతుంటానని చెప్పారు. కేంద్ర మంత్రి పాటిల్ సైతం.. దేశంలో అభివృద్ధిపై దృష్టి సారించిన నాయకుల్లో చంద్రబాబు ముందువరుసలో ఉంటారని చెప్పారు.

**చంద్రబాబు శ్రద్ధే కారణం**

తుంగభద్ర డ్యాంకు యుద్ధప్రాతిపదికన కొత్త క్రస్ట్‌గేట్లను అమర్చడంపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపారని, లేకుంటే ఈ క్రస్ట్ గేట్ల అమరిక మరో నాలుగైదేళ్లు ఆలస్యమయ్యేదని ఇంజనీరింగ్/గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు అన్నారు. తుంగభద్ర డ్యాంపై ఆయన మాట్లాడారు. మరో 50 ఏళ్ల వరకూ డ్యాంకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తదని భరోసా ఇచ్చారు.

# స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

హోసపేటెలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం సీఎం మాధవరం చేరుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రాలయం తెదేపా ఇన్‌ఛార్జ్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మన ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలి. తెదేపా నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారిని అక్కున చేర్చుకుంటా. ఓడిపోయిన వారిని పక్కన పెట్టేస్తా. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. మంత్రాలయం వైకాపా ఎమ్మెల్యే చిచ్చు పెడుతున్నారు.. ఆయనకు బుద్ధి చెబుతాం. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. అధికారం ఉంది కదా అని నేతలు ప్రజలకు అందుబాటులో లేకపోతే వారికి దూరమవుతారు. మంత్రాలయం తెదేపాలో అసమ్మతి, విభేదాలు లేకుండా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి గెలుపుకోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు.

# ఉద్యోగులకు భారీ భరోసా..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను "గుంపు మేస్త్రీ"నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

# పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా-ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి.

# 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

హైదరాబాద్:తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్,జూన్25: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..

ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యశాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు కీలక వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని వారు వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే ఈ సానుకూల మార్పు చోటుచేసుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపై కూడా ప్రధానంగా చర్చించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. మరోవైపు, సెప్టెంబర్ 5 నుంచి మొదటి విడత కింద 175 'లీప్' పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల కోసం 'ఏఐ ట్యూటర్' విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని 'క్లిక్కర్స్'కు అనుసంధానించాలని మంత్రి అధికారులకు సూచించారు.అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

గతంలో ఈ ఫీజు రూ.1,500గా ఉండేది. ఇక తత్కాల్ పథకం కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారి ఫీజు రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెరిగింది. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజు కూడా రూ.2 వేల నుంచి రూ.3,500కు పెరిగింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఇకపై రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4 వేలుగా ఉండేది. పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) కోసం ఇకపై రూ.5 వేలు చెల్లించాలి. తత్కాల్ స్కీమ్‌లో బుక్ చేసుకుంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో ఈ ఫీజులు వరుసగా రూ.6 వేలు, రూ.8,500 వేలకు పెరిగాయి. 18 ఏళ్ల పిల్లలకు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) ఫీజు రూ.1,750గా నిర్ణయించింది.

# సొంత కుమార్తెను ప్రభుత్వ బడిలో చేర్పించిన సర్పంచ్

**- బాచుప్పల ప్రాథమిక పాఠశాలలో 3 నుండి 18కి చేరిన విద్యార్థుల సంఖ్య**

**- గ్రామస్థులతో తీర్మానం.. అందరికీ ఆదర్శం**

**తొలివెలుగు, రామన్నపేట:** మండలం బాచుప్పల గ్రామ సర్పంచ్ మాధవి భూపాల్ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చొరవ చూపి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న తన కుమార్తె ఉద్వితను విడిపించి, బాచుప్పల గ్రామ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రేరణ పొందిన తాజా, మాజీ వార్డు సభ్యులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపేందుకు ముందుకు వచ్చారు. మన ఊరి బడిని మనమే కాపాడుకోవాలనే ఉద్దేశంతో సర్పంచ్ గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమై తల్లిదండ్రులందరిచే తీర్మానం చేయించారు. దీని ఫలితంగా గతంలో కేవలం 3 అడ్మిషన్లు మాత్రమే ఉన్న ఈ పాఠశాలలో కొత్తగా మరో 15 మంది విద్యార్థులు చేరడంతో మొత్తం సంఖ్య 18కి చేరింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రాంగణంలో నూతన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓర్సు వెంకటయ్య విద్యార్థులందరికీ ఉచితంగా నోటు పుస్తకాలను అందజేశారు. ప్రతి గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వాటిని పరిరక్షించుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సందేనబోయిన మహేశ్వరి రవి, ఉపాధ్యాయురాలు శిరీష, అంగన్‌వాడీ టీచర్ నాగమణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్దం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.




# సహకార సంఘం చైర్మన్‌గా శ్రీశైలం యాదవ్

- ఇంద్రపాలనగరంలో నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక
- నూతన పాలకమండలికి సర్పంచ్ సన్మానం

**తొలివెలుగు, రామన్నపేట:** మండలం ఇంద్రపాలనగరంలో గురువారం నిర్వహించిన నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘం ఎన్నికల్లో నూతన చైర్మన్‌గా కంబాలపల్లి శ్రీశైలం యాదవ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు విజయం సాధించి చైర్మన్ పదవిని కైవసం చేసుకున్నారు. శ్రీశైలం యాదవ్‌తో పాటు సింగనబోయిన శ్రీను, రాజన్న, అలివేలు నూతన డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ నూతన చైర్మన్, డైరెక్టర్లను శాలువాతో ఘనంగా సన్మానించి, సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎన్నికల్లో తమకు సహకరించిన ఓటర్లకు నూతన పాలకమండలి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. కార్యక్రమంలో డైరెక్టర్లు గర్ధాస్ దామోదర్, కొలగాని పాండు, సింగణబోయిన అశోక్, పగుడాల రవిశంకర్, గొర్ల సత్యనారాయణ, గర్ధాస్ వెంకటేశం, వార్డు సభ్యుడు వరికుప్పల స్వామి, మాజీ ఉపసర్పంచ్ గర్ధాస్ వెంకటేష్, ఎలక్షన్ ఆఫీసర్ తవుటం బిక్షపతి, మంటి అంజయ్య తదితరులు పాల్గొని నూతన చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలియజేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- భూదాన్ పోచంపల్లిలో ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ
- జూలై 24 లోగా ఫారాలు అందజేయాలి: తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి



**తొలివెలుగు,భూదాన్ పోచంపల్లి:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని భూదాన్ పోచంపల్లి తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం పురపాలక కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పట్టణంలో సాగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓ) పలు సూచనలు చేశారు. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ.. బోగస్ ఓట్ల నివారణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని, ఓటర్లు తమ పూర్తి వివరాలు, చిరునామాను నమోదు చేసి ఆ ఫారాలను జూలై 24వ తేదీ లోగా తిరిగి బీఎల్ఓలకు అందజేయాలని స్పష్టం చేశారు. గడువులోగా వివరాలు సమర్పించని వారు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ సుధాకర్ రావు, ఏఆర్ఐ నరసింహారెడ్డి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

# 28న పల్స్ పోలియో.. విజయవంతం చేయండి

- చౌటుప్పల్ మండలంలో 52 కేంద్రాల ఏర్పాటు
- 5,959 మంది చిన్నారులను గుర్తించినట్లు వెల్లడి
- మండల వైద్యాధికారి డాక్టర్ కాటం రాజు



**తొలివెలుగు, చౌటుప్పల్:** దేశవ్యాప్తంగా ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని చౌటుప్పల్ మండల వైద్యాధికారి డాక్టర్ సి.హెచ్. కాటం రాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలియో రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలన్నారు. మండల వ్యాప్తంగా సున్నా నుండి ఐదేళ్ల లోపు వయసున్న 5,959 మంది చిన్నారులను గుర్తించామని, వీరందరికీ ఆదివారం తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. చిన్నారుల సౌకర్యార్థం మండల పరిధిలో మొత్తం 52 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆదివారం నాడు ఏవైనా కారణాల వల్ల చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారుల కోసం సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది నేరుగా ఇంటింటికీ వచ్చి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాత్రికేయులు భాగస్వాములు కావాలని కోరారు. అందరి సహకారంతో వంద శాతం లక్ష్యాన్ని సాధించి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్యాధికారి పేర్కొన్నారు.

# పారిశ్రామిక అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలి





- టీఎస్ ఐపాస్ సమీక్షలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం
- టీ-ప్రైడ్ కింద 12 మంది లబ్ధిదారులకు రూ.35 లక్షల ప్రోత్సాహకాలు

**తొలివెలుగు, భువనగిరి రూరల్:** యాదాద్రి భువనగిరి జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వేదికగా జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ), టీఎస్ - ఐపాస్ సమన్వయ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టీఎస్ ఐపాస్ కింద అందిన నూతన పరిశ్రమల దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత గల పరిశ్రమలకు వేగంగా అనుమతులు జారీ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న టీ-ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 12 మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి ప్రోత్సాహకంగా రూ.35,00,000 మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నిధులు యువత ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ (జీఎం) తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం



- దివంగత నేత కుమార్తె వివాహానికి హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బోదాసు శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. గురువారం చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెంలోని జయ కన్వెన్షన్ హాలులో ఆయన కుమార్తె యమున వివాహ మహోత్సవం జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పితృవియోగంతో ఉన్న వధువు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే తన వ్యక్తిగత తరపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్క కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటామని, శ్రీనివాస్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు పాక మల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, నాయకులు మన్నెం వెంకటరెడ్డి, సర్పంచ్ గోరుగంటి సువర్ణ రవీందర్, మాజీ సర్పంచ్ దోటి కుమార్ యాదవ్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోదాసు చిన్న ఈదయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు పని భద్రత కల్పించాలి



- రాష్ట్ర ఎలక్ట్రిషన్ యూనియన్ అధ్యక్షుడు పి. జానయ్య డిమాండ్
- ముగిసిన ఐదు రోజుల సమ్మె

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రభుత్వం తగిన పని భద్రత కల్పించాలని రాష్ట్ర ఎలక్ట్రిషన్ యూనియన్ అధ్యక్షుడు పి. జానయ్య డిమాండ్ చేశారు. పురపాలక కేంద్రంలో గత ఐదు రోజులుగా ఎలక్ట్రీషియన్లు చేపట్టిన సమ్మె గురువారంతో ముగిసింది. స్థానిక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ, శ్రమకు తగ్గ లేబర్ ఛార్జీలు రాకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగ కార్మికులుగా ఎలాంటి ప్రభుత్వ భరోసా లేకపోయినా.. ప్రాణాలకు తెగించి వినియోగదారులకు నిరంతరం సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ప్రమాదకరమైన విధుల్లో ఉండే వీరికి ప్రభుత్వం ప్రత్యేక ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికులకు వినియోగదారులు కూడా సహకరించాలన్నారు. అనంతరం కార్మికుల సమ్మెను ఆయన విరమింపజేశారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నల్గొండ ప్రధాన కార్యదర్శి ఓరాల స్వామి, పోచంపల్లి మండల అధ్యక్షుడు రాసులూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎర్ర విగ్నేష్, కోశాధికారి తంతరపల్లి వినోద్ గౌడ్ పాల్గొన్నారు.



# ఆరోగ్య రంగంలో సరికొత్త విప్లవం.. డిజిటల్ మిషన్‌లో యాదాద్రి మోడల్ జిల్లా

- రెండు వారాల్లో ఆసుపత్రులు, వైద్యుల నమోదు పూర్తి కావాలి
- సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం

**తొలివెలుగు, భువనగిరి రూరల్:** దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య సంస్కరణల్లో ఒకటైన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎమ్) అమలులో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే మోడల్ జిల్లాగా ఎంపికైందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ అమలుపై జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య రంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేసి, ప్రతి పౌరుడి వైద్య సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ మిషన్ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ (ఎచ్ ఎఫ్ ఆర్), హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ (ఎచ్ పీ ఆర్) నమోదులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, ఫార్మసీలు, వైద్యులు వచ్చే రెండు వారాల్లోగా ఈ పోర్టల్‌లో తమ నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పౌరునికి ఆభా (ఏబీఎచ్ఏ) ఐడీ రూపొందించనున్నట్లు తెలిపారు. దీనివల్ల పాత వైద్య రికార్డులు, ప్రిస్క్రిప్షన్లు భద్రంగా నిల్వ ఉండటంతో పాటు, అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రోగి అనుమతితోనే వైద్యులు ఆయా రికార్డులను పరిశీలించే అవకాశం ఉంటుందని, వ్యక్తిగత ఆరోగ్య సమాచార గోప్యతకు పూర్తి రక్షణ కల్పించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, ఏబీడీఎం నోడల్ అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, స్టేట్ ట్రైనర్ సాయి కుమార్‌తో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దళిత వాడలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి డిమాండ్
- వలిగొండలో 'సమస్యలపై పోరుబాట' కార్యక్రమం ప్రారంభం

**తొలివెలుగు, వలిగొండ:** దళితవాడల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. దళితవాడల సమస్యల పరిష్కారం కోరుతూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జూన్ 25 నుండి జూలై 25 వరకు చేపట్టే 'పోరుబాట' అవగాహన, సర్వే కార్యక్రమాన్ని గురువారం ఆయన వలిగొండ మండల కేంద్రంతో పాటు దాసిరెడ్డిగూడెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా నేటికీ దళితవాడల్లో ఆశించిన ప్రగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దళిత లబ్ధిదారులకు ప్రత్యేక కోటా కింద అదనంగా మరో రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. దళితులకు 55 ఏళ్లకే వృద్ధాప్య పింఛను ఇవ్వాలని, అన్ని దళిత వార్డుల్లో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వలిగొండ ఎస్సీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, దాసిరెడ్డిగూడెంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు కొండూరు సత్తయ్య, నాయకులు కొమ్ము స్వామి, కందుల బాలయ్య, అండాలు, పోలేపాక లక్ష్మయ్య, ఎల్లంకి పాండు పాల్గొన్నారు.



## కేంద్రం నిధులు.. కాంగ్రెస్ 'సోకులు'!

**- సొంత పార్టీ గ్రామాలకే ఉపాధి హామీ నిధుల కేటాయింపు**

**- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై అల్లాపురం సర్పంచ్ మంజుల దిలీప్ రెడ్డి ఆగ్రహం**

**- అన్ని గ్రామాలకు సమానంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్**



**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని సర్పంచ్‌ల ఫోరం జిల్లా మహిళా అధ్యక్షురాలు, అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామాలకే రెండు దఫాలుగా నిధులు కేటాయించి, ఇతర గ్రామాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె విమర్శించారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. "సొమ్ము కేంద్రానిది.. సోకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేది" అన్న చందంగా పరిస్థితి మారిందని మండిపడ్డారు. ఉపాధి హామీ నిధులు ఏ ఒక్క పార్టీకి చెందినవి కావని, అవి గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రజాధనమని గుర్తు చేశారు. నిధుల కేటాయింపులో రాజకీయ వివక్ష చూపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, అధికార పార్టీకి చెందిన గ్రామాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల మిగతా గ్రామాల అభివృద్ధి పూర్తిగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల మధ్య తారతమ్యాలు చూపకుండా ప్రతి గ్రామ పంచాయతీకి సమానంగా ఉపాధి హామీ నిధులు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అభివృద్ధి అనేది ప్రతి గ్రామ ప్రజల హక్కు అని, సమాన నిధుల కేటాయింపు ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల బాధ్యత అని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మంజుల దిలీప్ రెడ్డి హెచ్చరించారు.

## బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

**- బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరామర్శ - పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు**



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని చల్లూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బూరుగు యాదగిరి, దిడ్డిగ కరుణాకర్ ల కుటుంబాలను గురువారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శాగ నవీన్ ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించారు. ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు.. బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో బాధిత కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మరణించిన వారి కుటుంబాలకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లూరు గ్రామ సర్పంచ్ రూప బాల్ నర్సయ్య, ఉప సర్పంచ్ బొంత సుధాకర్, సొల్లేటి స్వామి, మునిగడప కనకయ్య, గుంటి భగవంతు, మీసా కృష్ణ, గాడమల్ల యధేంధర్, గుంటి బిక్షపతి, ఎర్ర స్వామి, ఎండీ సైదులు, పల్లెపాటి ప్రవీణ్, బడే లక్ష్మయ్య, బడే రామచంద్రం, కోట ఎల్లయ్య, కోట మల్లేశం, బడే మైసయ్య, ఎండి ఖాసీం, ఎర్ర శ్రీకాంత్, బడే రాములు, జంగిలి కొండల్, పల్లెపాటి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.





## పేదల గూడు 'ఇందిరమ్మ ఇల్లు'.. సౌజన్య-నరసింహ గృహప్రవేశం!

**- హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గురువారం అధికారికంగా ప్రారంభమైంది. వార్డుకు చెందిన లబ్ధిదారులు సరిపల్లి సౌజన్య - నరసింహ దంపతులు ప్రభుత్వం అందించిన సహాయంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సదరు దంపతుల ఆహ్వానం మేరకు నిర్వహించిన గృహప్రవేశ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ హాజరై, రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ కుమార్ గౌడ్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ధర్మకర్త వర్కాల వాణి రవి గౌడ్ పాల్గొన్నారు. అలాగే గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ కృష్ణ, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు ఊదరి నరసింహ, సరిపల్లి మారయ్య, జంపాల కృష్ణ, మట్టపల్లి యాదగిరి, మారుపాక ప్రభాకర్, అయిలయ్య యాదవ్, వార్డు అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో జీవితాలు అంధకారం: ఎస్ఐ లింగారెడ్డి

**- రఘునాథపురంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు.. పోస్టర్ ఆవిష్కరణ**

**- యువతను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే**

**తొలివెలుగు, రాజాపేట:** మాదకద్రవ్యాల (డ్రగ్స్) వ్యసనానికి అలవాటుపడితే ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న యువత జీవితాలు బుగ్గిపాలు కావడంతో పాటు ఆయా కుటుంబాలు అంధకారంలోకి నెట్టబడతాయని రాజాపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) లింగారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ప్రచారంలో భాగంగా గురువారం రాజాపేట మండలం రఘునాథపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ రూపొందించిన




గోడపత్రికను (పోస్టర్) సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్‌తో కలిసి ఎస్ఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లింగారెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి పట్టిన డ్రగ్స్ మహమ్మారి వల్ల పిల్లలు, యువత జీవితాలు ఏ విధంగా దారి తప్పుతున్నాయో తల్లిదండ్రులు గమనించాలన్నారు. మాదకద్రవ్యాల్లోని రకాలు, వాటిని ఏ రూపంలో తీసుకుంటారు, డ్రగ్స్ వాడకం వల్ల మానవ శరీరంపై మరియు మెదడుపై చూపే తీవ్ర దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ బారిన పడిన వారి శారీరక లక్షణాలు, ప్రవర్తనలో వచ్చే విపరీత మార్పులను బట్టి వారిని గుర్తించవచ్చన్నారు. మాదకద్రవ్యాల రవాణా, కొనుగోలు, విక్రయాలు, వినియోగం చట్టప్రకారం నేరమని.. ఇందుకు పాల్పడితే కఠినమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్వాతి వేళ.. నారసింహునికి శతఘటాభిషేకం!



**- యాదాద్రిలో కొలువుదీరిన 108 వెండి కలశాలు**

**- వేదమంత్రాల నడుమ వైభవంగా స్వామివారి జన్మ నక్షత్ర వేడుకలు**

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ప్రధాన ఆలయంలో గురువారం స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చక బృందం వేదమంత్ర సహితంగా అష్టోత్తర శతఘటాభిషేకాన్ని వైభవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక పీఠాన్ని అమర్చి, పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం 108 వెండి కలశాలను ఏర్పాటు చేశారు. వాటిలో శుద్ధ గంగాజలం, వివిధ రకాల పండ్ల రసాలు, వనమూలికలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధాలను నింపి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకానికి ముందుగా పీఠంపై ప్రతిష్ఠించిన 108 వెండి కలశాలకు ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రాణప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అనంతరం తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వాతి నక్షత్ర పూజలలో భాగంగా ఈ మంత్రించిన జలాలతో స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకాన్ని ప్రారంభించారు. అర్చక బృందం పంచ సూక్తాలు, పంచ ఉపనిషత్తులు, దశ శాంతుల పఠనంతో మూడు గంటల పాటు నిర్విరామంగా అభిషేక కైంకర్యాన్ని గావించారు. అభిషేకానంతరం స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను ధరింపజేసి, నానావిధ పరిమళ పుష్పమాలికలతో నయనానందకరంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం ఆలయ యాగశాలలో అర్చకులు ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ విశేష క్రతువులో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) భవానీ శంకర్ పాల్గొని, పీఠంపై ఉన్న కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నల్లంధీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, శ్రీధరాచార్యులు, అర్చకులు కిరణ్ కుమార్ ఆచార్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## పుష్ప రంజితం.. నారసింహుని పూజార్థం!





**- యాదగిరిగుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన**

**- భక్తజన సందోహం నడుమ కనులపండువగా తిరువీధి సేవ**

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ప్రధాన ఆలయంలో గురువారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పర్వాన్ని అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఉదయాన్నే నారసింహుడికి, లక్ష్మీఅమ్మవారికి పంచామృతాలతో తిరుమంజన అభిషేకం గావించి, అనంతరం పట్టువస్త్రాలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. తదనంతరం ఆలయ ముఖమండపంలోని ప్రత్యేక పీఠంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మల్లె, గులాబీ, చామంతి, మందారం, సంపంగి, మల్లిక వంటి వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలతో స్వామివారి నామస్మరణ చేస్తూ లక్ష పుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేక సేవలో అధిష్ఠింపజేసి, మంగళవాయిద్యాలు, భజనల నడుమ ఆలయ తిరుమాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ వేడుకలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్రచార్యులు, శ్రీధరాచార్యులు, కిరణ్ కుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేణికుంట పాల సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం.. చైర్మన్‌గా మధు!

**- ప్రైవేటు డెయిరీలను నమ్మి మోసపోవద్దు: నూతన చైర్మన్**

**-డైరెక్టర్లుగా రాజశేఖర్, బాలరాజు, భాస్కర్ రెడ్డి, మైస గౌడ్**

**తొలివెలుగు, రాజాపేట:** మండలం రేణికుంట పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (పాల సొసైటీ) చైర్మన్‌గా పోసుకొండ మధు వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో నూతన పాలకవర్గ ఎన్నికను ఏకగ్రీవంగా పూర్తి చేశారు. చైర్మన్‌తో పాటు పాలకవర్గ డైరెక్టర్లుగా దయ్యాల రాజశేఖర్, కాలే బాలరాజు, బూరుగు భాస్కర్ రెడ్డి, రంగ మైస గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని స్థానిక రైతులు, సహకార సంఘం సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. అనంతరం చైర్మన్ పోసుకొండ మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రేణికుంట గ్రామానికి చెందిన పాడి రైతులకు, సహకార సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాడి రైతులు ప్రైవేటు డెయిరీలను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ పరిధిలోని మదర్ డెయిరీకే పాలను పోసి మద్దతు ధరతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు, లబ్ధిని పొందాలని సూచించారు. సొసైటీ బలోపేతానికి, పాడి రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పాడి రైతులు, సహకార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.






# ఓటర్ల ఇంటింటి సర్వే ప్రారంభం

- ఇన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసిన బీఎల్ఓలు
- వచ్చే నెల 24 వరకు ప్రక్రియ నిరంతరాయం: తహసీల్దార్ రవి కిరణ్

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా గురువారం ఇంటింటి సర్వే కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు ఇన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సాగుతున్న సర్వే ప్రక్రియను తహసీల్దార్ రవి కిరణ్, సీనియర్ అసిస్టెంట్ రహీం, జీపీఓ సుదర్శన్‌లతో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి కిరణ్ మాట్లాడుతూ.. నిష్పాక్షికమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం (జూన్ 25) ప్రారంభమైన ఈ ఇంటింటి సర్వే ప్రక్రియ వచ్చే నెల (జూలై) 24వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఫారాల భర్తీలో బీఎల్ఓలకు ఎదురవుతున్న పలు సాంకేతిక సందేహాలను ఆయన అక్కడికక్కడే నివృత్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా సర్వే సాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు రేపాక భాగ్యలక్ష్మి, దేవి, స్థానిక నాయకులు రావుల హరిబాబు, కోరే మల్లయ్య పాల్గొన్నారు.

# మిత్రుని కుటుంబానికి చిన్ననాటి స్నేహితుల ఆర్థిక సాయం

- చల్లూరులో బాధిత కుటుంబానికి రూ. 25,000 అందజేత
- ఆదర్శంగా నిలిచిన 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు



**తొలివెలుగు, రాజాపేట:** కష్టకాలంలో తోడు నిలిచి తామున్నామంటూ చిన్ననాటి మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. రాజాపేట మండల పరిధిలోని చల్లూరు గ్రామానికి చెందిన దిడ్డిగ కరుణాకర్ ఇటీవల అకాల మరణం చెందాడు. కాగా, కరుణాకర్ చిన్ననాటి స్నేహితులైన 2004-05 విద్యాసంవత్సరం పదో తరగతి సహాధ్యాయులంతా గురువారం చల్లూరులోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మిత్రుని మరణం పట్ల తీవ్ర సానుభూతిని వ్యక్తం చేస్తూ.. తమ వంతుగా సేకరించిన రూ. 25,000 ల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్ననాటి మిత్రుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఆ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటూ మనోధైర్యాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. చిన్ననాటి స్నేహాన్ని గుర్తుపెట్టుకుని, మిత్రుని కుటుంబానికి అండగా నిలిచిన యువకుల చొరవను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో చెట్కూరి కుమార్, చోల్లేటి స్వామి, గ్యార నాగరాజు, కోట శివకృష్ణ, గుంటి రఘుపతి, బాధిత కుటుంబ సభ్యులు

# నీర్నేముల పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

- ఉపాధ్యాయుల కొరతతో కుంటుపడుతున్న బోధన
- పాఠశాలలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే

**తొలివెలుగు, రామన్నపేట:** మండలం నీర్నేముల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీపీ నాగటి ఉపేందర్ డిమాండ్ చేశారు. పాఠశాలలోని సౌకర్యాలపై సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. పాఠశాలలో 1 నుంచి 7 తరగతులు ఉండగా, 60 మంది విద్యార్థులకు గాను కేవలం ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రానున్న ఆగస్టులో మరో ఉపాధ్యాయురాలు పదవీ విరమణ చేయనుండటంతో ఆ సంఖ్య ఐదుకు పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటే బోధన పూర్తిగా కుంటుపడుతుందని, తక్షణమే అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి విద్యార్థికి కేవలం రూ.6.18 మాత్రమే ఇస్తోందని, ఇంత తక్కువ మొత్తంతో నాణ్యమైన భోజనం అందించడం సాధ్యం కాదన్నారు. పాఠశాలలోని ఆరు గదుల్లో ఉన్న 12 ఫ్యాన్లలో ఎనిమిది మాత్రమే పనిచేస్తున్నాయని, పాడైపోయిన నాలుగు ఫ్యాన్ల స్థానంలో కొత్తవి అమర్చాలన్నారు. తాగునీటి ట్యాంకులను సక్రమంగా శుభ్రం చేయడం లేదని మండిపడ్డారు. పాఠశాలలో 31 మంది విద్యార్థినులు ఉన్నారని, ప్రస్తుత మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరినందున బాలికల కోసం నూతన మరుగుదొడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి ఏశబోయిన రామచంద్రం, మాజీ వార్డు సభ్యులు నేమనంది లింగయ్య, బోయిని వేణు, నాగటి నరేష్, ఆవుల మత్స్యగిరి పాల్గొన్నారు.



# రఘునాథపురంలో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

- రూ. 4 లక్షల ఎంపీటీసీ నిధులతో నిర్మాణం
- పనులను ప్రారంభించిన సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రఘునాథపురం గ్రామంలో గురువారం అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎదురవుతున్న మురుగునీటి సమస్య పరిష్కారం కోసం మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 4 లక్షల ఎంపీటీసీ నిధులను కేటాయించారు. ఈ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాలనీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ అండర్ డ్రైనేజీ పనులను చేపట్టినట్లు తెలిపారు. పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గ్రామానికి నిధుల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేసిన మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య గౌడ్‌కు ఈ సందర్భంగా కాలనీ వాసులు, గ్రామ పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కల్యాణి రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాగర్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బింగి రమేష్, వార్డు సభ్యులు లక్ష్మీ చంద్రశేఖర్, కటకం ప్రశాంత్, బల్ల హరీష్, వడ్లకొండ మధు, ఉచేంతల స్వామి, గువ్వల సిద్ధులు, దొంకేన భాస్కర్, తుంగ అక్షయ్, తుంగ సతీష్, కలకుట్ల కొమురయ్య, కొన్ని పోచయ్య, కటకం వెంకటేష్, కొండం రాజు, కలకుంట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హరే రామ హరే కృష్ణ.. నామస్మరణతో మార్మోగిన రాజాపేట!

- నిర్జల ఏకాదశి పురస్కరించుకుని నగర సంకీర్తన
- శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు





**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. వేకువజామున భక్తులు హరే రామ హరే కృష్ణ నామ జపంతో నగర సంకీర్తన నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుంచి ప్రారంభమైన ఈ సంకీర్తనలో జై శ్రీమన్నారాయణ భక్త బృందంతో పాటు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నగర సంకీర్తన రాజాపేట ప్రధాన వీధుల గుండా సాగుతూ పుట్ట హనుమాన్ ఆలయంతో పాటు పలు స్థానిక దేవాలయాలను దర్శించుకుంది. అనంతరం శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. మార్కుక్ శ్రీ భావానంద స్వామి వారి ఆశీస్సులతో అదరాసుపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో రాజాపేట శాఖ అధ్యక్షుడు నంగునూరు రాజు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో బిర్రు శ్రీనివాసులు, నాల్ల శేఖర్, కూనూరు బిక్షపతి, ఉప్పల రమేష్, బోగ లత, పబ్బోజు పరమేశ్వరి, చామకూర అరుణ, రేపాక భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

# ఉప్పలపహాడ్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



- గ్రామాల్లో మట్టి రోడ్లు లేకుండా చేయడమే లక్ష్యం: సర్పంచ్ బీరప్ప
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు గ్రామస్తుల కృతజ్ఞతలు

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల పరిధిలోని ఉప్పలపహాడ్ గ్రామంలో గురువారం నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహాయ సహకారాలతో మంజూరైన ఈ పనులకు గ్రామ సర్పంచ్ చిన్నం బీరప్ప ఆధ్వర్యంలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నం బీరప్ప మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవతో ఉప్పలపహాడ్ గ్రామానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామంలో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా, ప్రతి గల్లీలో సీసీ రోడ్లు నిర్మించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మరియాల స్వరాజ్యలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నిడిగొండ శ్రీనివాస్, మండల పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ మరియాల వెంకటేశ్వర్లు గుప్త, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తీగల అశోక్, సోషల్ మీడియా కన్వీనర్ లోడే శ్రీకాంత్, వార్డు సభ్యులు గంధమాల అయోధ్య, చిన్నం శ్రీనివాస్, రాంపక నరసయ్య, తీగల స్వప్న, లోడే సునీత, మాజీ వార్డు సభ్యులు తీగల బిక్షం, లోడి రేణుక, కారోబార్ కడకంచి ఆంజనేయులు, జెట్టి యాదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అడ్డగూడూరు టీఆర్ఆర్పీ అధ్యక్షుడిగా డప్పు యాదగిరి

- నియామక పత్రం అందజేసిన పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న
- గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి పిలుపు

**తొలివెలుగు, అడ్డగూడూరు:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్ఆర్పీ) అడ్డగూడూరు మండల అధ్యక్షుడిగా డప్పు యాదగిరి నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ?ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతానికి నూతన కమిటీలు దోహదపడాలన్నారు. ప్రతి గ్రామంలోనూ పార్టీని పటిష్ఠం చేస్తూ, ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం డప్పు యాదగిరి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన తీన్మార్ మల్లన్నకు, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అందరినీ కలుపుకుంటూ మండలంలో పార్టీని అగ్రభాగాన నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు వేగం పెంచండి

- లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలి
- వనమహోత్సవం లక్ష్యాలకు అనుగుణంగా గుంతల తవ్వకాలు పూర్తి చేయాలని ఆదేశం
- అధికారులకు సూచించిన జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్

**తొలివెలుగు, రామన్నపేట:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కల నాటేందుకు అవసరమైన గుంతల తవ్వకాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై ఆరా తీసిన ఆయన, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాములు, ఏపీవో వెంకన్న, హౌసింగ్ ఏఈ సురేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రతను కొనసాగించాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన నకిరేకంటి నరసింహ



**తొలివెలుగు, రామన్నపేట:** మాజీ ఐపీఎస్ అధికారి, రాజకీయ నాయకుడు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రతను, ఆయనకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆర్ఎస్పీ అభిమాని నకిరేకంటి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు 26 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పోలీస్ శాఖలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ప్రవీణ్ కుమార్‌కు మావోయిస్టులు, వారి సానుభూతిపరుల నుండి ముప్పు పొంచి ఉందన్నారు. గత ప్రభుత్వాలు ఈ ముప్పును గుర్తించి భద్రతను కల్పించాయని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం విధానపరమైన విమర్శలను భరించలేక కక్షపూరితంగా బుల్లెట్ ప్రూఫ్ కారును, సిబ్బందిని తొలగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాపక్షాన నిలిచే నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, ఆర్ఎస్పీ ప్రాణాలకు ఏమైనా జరిగితే ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. భద్రతను ఉపసంహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.



# నవ్వు లేని రోజు వృథా అంటున్న వెంకటేశ్

అగ్ర నటుడు వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. శిరీష్ నిర్మాతగా దిల్‌రాజు సమర్పణలో రూపొందుతోన్న ఈచిత్రం పొల్లాచ్చిలో భారీ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. నెలరోజులకు పైగా జరిగిన ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై పాటలు, యాక్షన్ పార్ట్‌తో కూడిన కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. వినాయకచవితి పర్వదినం సందర్భంగా సెట్‌లోని ఆహ్లాదకరమైన వాతావరణం చూపించే గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. అనే చార్లీ చాప్లిన్ కోట్ సూచిస్తూ నటీనటుల మధ్య ఆనందాన్ని, స్నేహాన్ని ఈ వీడియోలో ఆవిష్కరించారు. వెంకటేష్ సంప్రదాయ దుస్తుల్లో కళ్లద్దాలతో కనిపించగా, ఐశ్వర్యరాజేష్ ఆయన భార్య భాగ్య పాత్రలో, క్లాసిక్ చీరలో దర్శనమిచ్చింది. అలాగే మీనాక్షి చౌదరి ఎక్స్‌లవ్ పాత్రలో మోడ్రెన్ అవతార్‌లో కనిపించింది. మున్నార్ దగ్గర ఇంటర్వెల్ సీక్వెన్స్ చిత్రీకరించామని, సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.

## రజనీకాంత్ వేట్టాయాన్‌లో తొలిపాట విడుదల.. ఏఐతో వాసుదేవన్ గాత్రం రీ క్రియేట్..

దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మూవీ వేట్టాయాన్‌ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, రానా, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 10వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో వేట్టయాన్ సినిమాలోని తొలి పాట మనసిలాయో(లిరికల్ వీడియో)ను సోమవారం విడుదల చేశారు. చెన్నైలో జరిగిన ఓ బూటకపు ఎన్‌కౌంటర్ ఇతివృత్తగా ఈ సినిమాను రూపొందించారు. ఈ పాట కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో దివంగత గాయకుడు మలేషియా వాసుదేవన్ గాత్రాన్ని రీ క్రియేట్ చేశారు. దీప్తి సురేశ్, యుగేంద్రన్, అనిరుధ్ ఈ పాటను ఆలపించారు.

# విఫల ప్రేమకథ.. బ్రేకప్ నిజంగా చాలా బాధాకరం: తమన్నా

ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన విఫల ప్రేమకథల గురించి గుర్తుచేసుకుంది మిల్కీబ్యూటీ తమన్నా. ఆమె హృదయం ఇప్పటికి రెండు సార్లు ముక్కలైందట. ఈ విషయంపై తమన్నా మాట్లాడుతూ 'బ్రేకప్ నిజంగా చాలా బాధాకరం. అది అనుభవించిన వారికే తెలుస్తుంది. నా జీవితంలో రెండుసార్లు బ్రేకప్‌ని ఎదుర్కొన్నాను. టీనేజ్‌లో ఉన్నప్పుడే తొలి హార్ట్‌బ్రేక్ ఎదురైంది. జీవితంలో ఏదోఒకటి సాధించాలనేది నా అభిమతం. ఓ వ్యక్తికోసం లక్ష్యాన్ని వదులుకోవడం నచ్చలేదు. ఆ కారణంలో ఓ బంధం తెగిపోయింది. అది జరిగిన కొన్నేళ్ల తర్వాత ఓ వ్యక్తిని ఇష్టపడ్డా. అతనితో కొంతకాలం రిలేషన్లో ఉన్నా. అతను మాట్లాడితే అబద్ధాలే. అనవసరంగా అబద్ధాలాడేవాళ్లంటే నాకు అసహ్యం. తను నాకు సెట్ కాదని మనసు చెప్పింది. దాంతో అతడ్ని కట్ చేయక తప్పలేదు.' అని గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంది.





# ఆ వార్తలే నిజమయ్యాయి..

## విడాకులు ప్రకటించిన స్టార్ హీరో



తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ జయం రవి ఈ కోలీవుడ్ స్టార్ యాక్టర్ తన సతీమణి ఆర్తితో విడాకులు తీసుకుంటున్నాడంటూ కొంతకాలంగా నెట్టింట చక్కర్లు కొడుతున్న వార్తలు నిజమయ్యాయి. తన సతీమణితో 15 ఏండ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ విడాకులను ప్రకటించాడు జయం రవి. వ్యక్తిగల కారణాలు, కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కఠిన నిర్ణయం తీసుకున్నాం. ప్రతీ ఒక్కరూ మా ప్రైవసీని గౌరవిస్తారని విజ్ఞప్తి చేస్తున్నానని సోషల్ మీడియాలో ఓ సందేశాన్ని జయం రవి అందరితో పంచుకున్నాడు .ప్రముఖ టెలివిజన్ ప్రొడ్యూసర్ అయిన సుజాత విజయ కుమార్ కూతురు ఆర్తి. జయం రవి-ఆర్తికి ఇద్దరు కుమారులు. జయం రవి చివరగా పొన్నియన్ సెల్వన్ 2తో సక్సెస్ అందుకున్నాడు. ఈ సినిమా తర్వాత వచ్చిన చిత్రాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయాయి. జయం రవి ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి.

# ఒకే ఫ్రేమ్‌లో సందీప్ రెడ్డి వంగా, జూనియర్ ఎన్టీఆర్

అర్జున్ రెడ్డి సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు సందీప్ రెడ్డి వంగా తొలి సినిమాతోనే నెట్టింట హాట్ టాపిక్‌గా మారాడు. ఇక రణ్‌బీర్‌కపూర్‌తో తెరకెక్కించిన యానిమల్ వసూళ్ల వర్షం కురిపించింది. ఈ క్రేజీ డైరెక్టర్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ తో కలిసి ఉన్న ఫొటో ఒకటి ఇప్పుడు నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. తారక్ నటించిన దేవర ట్రైలర్‌ను సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్న విషయం తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా, తారక్ చర్చించుకుంటున్న స్టిల్ చూసిన మూవీ లవర్స్.. ఏంటీ ఈ ఇద్దరు సినిమాకు ఏమైనా ప్లాన్ చేస్తున్నారా..? అంటూ మాట్లాడుకుంటున్నారు. అయితే ఈ క్రేజీ సెలబ్రిటీల కలుసుకోవడం వెనుక సీక్రెట్ ఏమీ లేదని.. ఇద్దరిదీ కేవలం సరదా డిస్కషన్ మాత్రమేనని ఇన్‌సైడ్ టాక్. ఇదిలా ఉంటే అభిమానులు మాత్రం అర్జున రెడ్డి దర్శకుడు తారక్ కోసం సెన్సేషనల్ స్టోరీ రాయాలని భావిస్తుండగా.. మరి రానున్న రోజుల్లో ఈ ఇద్దరి కాంబోలో సినిమా ఏమైనా వస్తుందేమో చూడాలి.కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న దేవర రెండు పార్టులుగా రాబోతుండగా.. పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సైఫ్ అలీఖాన్, ప్రకాశ్ రాజ్, షైన్ టామ్ చాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# మనసుని తాకే మై లవ్..

ప్రతిష్టాత్మక మెగా సూపర్‌గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో తెరకెక్కిన మ్యూజికల్ లవ్ ఆల్బమ్ 'మై లవ్'. కిశోర్ తేజా, సాత్విక జంటగా నటించిన ఈ సాంగ్‌ని ఎస్.కె.టి. ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై వాకాడ అప్పారావు నిర్మించారు. సురేష్ బనిశెట్టి రాసిన ఈ పాటను, క్రాంతి ఆచార్య స్వరపరచగా, కపిల్ కపిలన్ ఆలపించారు. మ్యూజికల్ లవర్స్‌ని మెస్మరైజ్ చేసేలా ఈ పాట ఉంటుందని, యువజంట కిశోర్ తేజా, సాత్విక స్క్రీన్ కెమిస్ట్రీ లవ్లీగా ఉంటుందని, రామ్‌రెడ్డి పన్నాలా అద్భుతమైన కాన్సెప్ట్‌తో హార్ట్ టచ్చింగ్‌గా ఈ పాటను మలిచారని శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేకర్స్ తెలిపారు.

